దేవదూత

శ్రీ సి. సి. పున్నయ్య

అవి వేసవికాలపు రోజులు. మధ్యాహ్న సమయము. తారు రోడ్లు భగ భగ మండుతున్నవి. ఎండ వేడిమికి మనుష్యులు సేదదీర్చుకుంటుంటే పక్షులు సయితము చెట్ల కొమ్మలమీద తలదాచుకొని నోళ్లు తెరచి ఆరాటపడుతున్నవి. జనసంచారము బహు స్వల్పముగా నున్నది. రోడ్డు ప్రక్కగా చీలికలు పేలికలయిన చొక్కా, షరాయిలతో కాళ్ళకు చెప్పలయినా లేకుండా క్రింద పైన మండుతూ నడుస్తున్నాడు. ఒళ్ళు, గుడ్డలు దుమ్ము ధూళితో ఆవరించియున్నది. ముఖం వాడిపోయి ఏనాడో భోంచేసిన వ్యక్తిలాగ కనుపించాడు. నడక బహు నీరసంగా నున్నది. పదే పదే చేతిలోని రెండు అణా బిళ్ళలను చూచుకుంటూ, మరల షరాయి జేబులో వేసికుంటూ నడుస్తున్నాడు. దారిన అక్కడక్కడ దుకాణములలో తినుబండారములమ్ముతున్నా, కొనేవాడిలాగ సమీపానికిపోయి మరల వెనుకకు తిరిగి నడక సాగిస్తున్నాడు. తన దగ్గరనున్న బేడ డబ్బులతో ఏదైనా కొనుక్కొనితిని ఆకలి తీర్చుకోవాలని యున్నట్లున్నది, కాని దానితో ఆకలి తీరదనే నిస్పృహ అతని వాలకంలో కనుపిస్తున్నది. అతనికి గల ఆశ—సాయంకాలము వరకు అలాగే గడిపితే లభ్యమయ్యే డబ్బులతో కడుపు నింపుకోవచ్చనేది.

అదొక వేపచెట్టు. దాని నీడ అనేక శ్రమజీవులకు ఎండలో ఆశ్రయమిస్తుంది. ఏధర్మాత్ముడో చెట్టుమొదట్లో చుట్టూ సిమెంటు అరుగు కట్టించాడు. దానిమీద అనేకులు కూర్చొని, పండుకొని సేదదీర్చుకుంటుంటారు. అక్కడే ఒకడు టీ, రొట్టె ముక్కలు అమ్ముతుంటాడు. మరొక ప్రక్కన ఒక ముసలమ్మ వేరుశనగ కాయలు, ఉడకబెట్టిన చిలకడ దుంపలు, రాచ ఉసిరి కాయలు కుప్పలుపెట్టి అమ్ముతుంటుంది. ప్రాక్కుతూ ప్రోలుతూ ఆ బాలుడు ఆ చెట్టు నీడకు చేరుకొని అరుగుమీద కూలబడ్డాడు. కోలాహలంగా టీ నీళ్ళకు ముసలమ్మ చుట్టూ గెనుసు గెడ్డలకు, వేరుశనగ కాయలకు ఎగబడుతున్న శ్రమ జీవులు ఆ బాలుని ఆకర్షించారు. కొందరు ఆప్యాయంగా టీ త్రాగుతున్నారు. మరి కొందరు అరుగుమీద కూర్చొని వేరుశనగ కాయలు, గెనుసు గెడ్డలు తిని కడుపులు నింపుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. వారి చెమటతోటి, దుమ్ము ధూళితోటి ఆవరించియున్న దేహాలు సూర్యరశ్మిలో తళ తళ మెరుస్తున్నవి. వాళ్ళను చూడను చూడను అతని ఆకలితారామండలంగా ద హిం చు క పో తు న్న ది. అక్కడయున్నవాళ్ళు అతని ముఖ వాలకం చూచి "అయ్యో పాపం! ఎన్ని రోజులయిందో అన్నము తిని" అనకలిగినవారేకాని తామే అర్ధ కడుపైనా నింపుకోలేని పీడిత ప్రజలు అతనికేం సహాయం చేయగలరు!

అప్పటి వరకు చెట్టునీడనున్న ముసలాడు ఒక చేతిలో కర్ర, మరొక చేతిలో డబ్బాతో వణకుతూ రోడ్డును దాటసాగాడు. సగందూరం దాటేసరికి ఒక సైకిలువచ్చి ఢీ కొని చేతిలోని కర్ర ఒకవైపు, డబ్బా మరియొక వైపు క్రిందపడిపోయి ముసలాడు నేలకొరిగాడు. డబ్బాలోని అణా డబ్బులు రోడ్డు మీద దొర్లిపోయినవి. కనబడీ, కనబడని చూపుతో క్రింద దొర్లిపోయిన డబ్బుల కొరకు తవుడులాడ సాగాడు ముసలాడు. వస్తూపోతూవున్నవారు ఎవరి వ్యాపకంమీద వారు వెళుతున్నారు కాని నడిరోడ్డున, మండుటెండలో పడిపోయిన ముసలాడి అతీ, గతీ ఎవరినీ ఆకర్షించలేదు. దీన్ని చూస్తున్న బాలుడు మెల్లగా ముసలాడి దగ్గరకువెళ్లి రోడ్డుమీద దొర్లి పడియున్న డబ్బులను ఏరి డబ్బాలో వేస్తూ "తాతా! యివిగో నీ దొర్లిపోయిన డబ్బులు—ఈ వయస్సులో తోడు లేకుండా తిరిగితే ప్రమాదం కదూ!— నేను పట్టు

కొని మెల్లగా అవతలికి చేరుస్తాను పద — కార్లు బండ్లు వచ్చేలోపల" అని చేయూతయిచ్చి లేపి కర్ర, డబ్బా అందిచ్చాడు.

మెల్లగా నడుస్తూ "ఎవరు బాబూ! నీవు— దేవదూతలాగ వచ్చావు! నాబోటి దిక్కులేనివాడికి భగవంతుడు తప్ప మరెవ్వరు తోడుంటారు" అన్నాడు.

"తాతా! నాకూ నా అనేవాళ్ళెవరూ లేరు— ఉన్నవాళ్ళైనా యింకా ఏమైనా నా దగ్గర లభిస్తే దోస్తామనుకునేవారే కాని లేనిపూట పిలిచి పిడికెడు మెతుకులు పెట్టేవారులేరు. నీ మాదిరిగానే భగవంతుని నమ్మి తిరుగుతూ, ఉన్ననాడు తిని లేనినాడు లేనట్లుగా జీవయాత్ర సాగిస్తున్నాను. నీకు అభ్యంతరము లేకపోతే నీకు తోడుగానుండి లభించిన దానిని యిద్దరం పంచుకుందాము" అన్నాడు తాను ముసలాడి ప్రాపకంతోనైనా తిండికిలోటులేకుండా జీవయాత్ర సాగుతుందికదా యని. ముసలాడు సయితం తను లేవలేనిరోజులలో కబోదిగా తనకు యీ బాలుడు తోడునీడగా నుండటానికి భగవత్ప్రేరితుడై తన దగ్గరకు వచ్చాడనే నమ్మకంతో సరేనన్నాడు.

"ఏం బాబూ! యీ రోజు నీవు భోంచేసినట్లు లేదే—పోయి ఏదైనా తినిరా" అంటూ చొక్కా జేబులోని పావలా బిళ్ళ తీసి యిచ్చాడు. ముసలాడు రోడ్డు ప్రక్కన చతికిలబడి ఆ పిల్లవాడు ఒక రొట్టె ముక్క, టీ నీళ్లు త్రాగి ముసలాడికొక రొట్టె, అర కప్పు టీ తెచ్చి యిచ్చాడు.

ముసలాడి ముఖం వికసించింది. "బాబూ! నీలాటి పిల్లవాడు నాకున్నట్లయితే యీ వయస్సులో నా కెంత సహాయంగానో ఉండేది" అన్నాడు రొట్టెను తుంచుకొని తింటూ.

"ఆ కొరత తీర్చటానికి నేను వచ్చాను కదా తాతా!" అన్నాడా పిల్లవాడు. రొట్టె తిని, టీ త్రాగి కాగానే ముసలాడు, పిల్లవాడు నగర మధ్యంలోకి వెళ్ళారు.

సాయంకాల మయింది. ఆకాశాన్నంటుతున్న మేడలు, మిద్దెలు, ధగ ధగాయమానంగా వెలుగుతున్న విద్యుద్దీపాలు యీ ప్రపంచంలో దరిద్రమనేదే లేదనిపిస్తున్నవి. తమ నిత్యజీవితము ఎలాగ గడుస్తున్నా దరిద్రులు, సంపన్నులుకూడ చలవ దుస్తులతో, తళతళ లాడే నగలతో అటు యిటు తిరుగుతున్నారు. కాని ధరించిన నగలు బంగారవునో కాదో, దుస్తులు తమవానో కాదో భగవంతునికే తెలియాలి. ఆ విద్యుద్దీప కాంతుల్లో బీదలు, ధనవంతులు ఒకే రకంగానే కనుపించారు. నగరాల్లోని లేమిడిని చలవగుడ్డలు, కృత్రిమ నగలు మరుగుపరుస్తుంటవి.

జనసమ్మర్దంలో ముసలాడు, అతని వెంట బాలుడు "అమ్మా! బాబూ! దిక్కులేనివాళ్ళం — ధర్మం చెయ్యండి" అంటూ దీనాలాపాలు చేస్తున్నారు. కానీ డబ్బు యిచ్చిన ధర్మాత్ములకంటె వాళ్ళ వైపు చూడనైనా చూడకుండా పోయే మహారాజుల సంఖ్యయే అధికమనిపించింది. రాత్రి 9 గంటలయేసరికి రెండు రూపాయల డబ్బులు దొరికినవి. ఇద్దరూ ఆకలిని చల్లార్చుకొని పాడుపడియున్న చావడిలోకి విశ్రమించడానికి వెళ్ళారు.

ప్రతిదినం నగరంలో తిరుగుతూ పిల్లాడు ముసలాడిని ఏవేవో ప్రశ్నలు వేస్తుండేవాడు. ముసలాడు సయితం ఓర్పుతో తనకు తెలిసినంతవరకు అతనిని సమాధాన పరిచేవాడు. త్రోవన ఎత్తైన భవనాలతో పాటు ఉన్నతులైన వ్యక్తులు సయితం వారి కెదురయ్యేవారు. అందులో ముసలాడికి పూర్వపరిచితులే కాదు—తన సహాయ సహకారాలతో రాజకీయంగా ఆర్థికంగా ఉన్నత పథమునందుకున్న వారనేకులుండేవారు; వారి అవసరాలు గడిచేవరకు స్నేహితులుగా ఆప్తులుగానుండి తర్వాత ఆ బీదవాడిని ఆకలి దప్పులకు బలిచేసిన స్వార్థపరులు, ఎదురుపడినప్పుడు సయితం అతనితో పలికితే అణా డబ్బులు యివ్వాల్సి వస్తుందని ముఖం తప్పించి నడిచేవారు.

ఆ రోజు మహాత్మ్యమేమిటో కాని నివాసం బయలుదేరినప్పటినుండి మధ్యాహ్నం పన్నెండు గంటలవరకు

నాలుగు కానులు మాత్రమే లభించినవి. వాళ్ల ముఖాలపై నిస్పృహ తాండవిస్తున్నది. అయినా నడక సాగిస్తున్నారు. ఒక రాజభవనంలాంటి మేడ దగ్గరకు వచ్చారు. దాని ముందు తోటలో అనేక రకాల పుష్పములు పూచి కనుల కింపుగా నున్నది. ఆ భవనంలోకి వస్తూ పోతున్న మనుష్యులనుబట్టి పెద్ద వ్యాపార సంస్థయనిపించింది.

"బాబూ! యీ మేడ ఎవరిదనుకొన్నావు!— ధర్మాత్ముడు నరసయ్యగారిది. బీదవాడుగా జీవయాత్ర ప్రారంభించి లక్షలు ఆర్జించాడు. నేను యిక్కడ ఆయన దగ్గర కొన్ని సంవత్సరాలు పని చేశాను" అన్నాడు.

అంతలో ఒకాయన సూటు, బూటు వేసుకొని ఠీవిగా కళ్ళద్దాలను సవరించుకుంటూ బయటికి వచ్చాడు.

"నమస్కారం బాబయ్యా!" అన్నాడు అతనిని చూచి ముసలాడు. దాన్ని గమనించనట్లు వెళ్ళిపోయాడు ఆ విలాస పురుషుడు.

"ఎవరు తాతా! యిలా పోయింది—నమస్కారం పెడితే కన్నెత్తి అయినా చూడకుండా పోయాడు."

"ఆయన యీనాడు నరసయ్యగారి సర్వస్వమునకు మేనేజరు. ఆయనకు మనమంటే లక్ష్యమెందుకుండాలి! అసలు నరసయ్యే తన మన అనే స్వకులాభిమానం, స్వబంధు అభిమానం లేకుండా సంపాదించినదంతా కులము గోత్రముకానివారలకు కట్టబెట్టిపోతే రొళ్లుకోడానికి వచ్చిన యీయనబోటివారికి దయ దాక్షిణ్యాలు ఎలాగుంటవి మనమీద!"

"అయితే యీ వ్యాపార సంస్థ నిర్వహణంతా యింతకాలంనుంచి యీయనే చేశాడన్నమాట!"

"పిచ్చివాడా - యీయన మధ్యలో వచ్చినవాడు —సంవత్సరాల పర్యంతము అల్ప జీతాలతో చాకిరి చేసిన ఫలితమే యీనాటి సిరిసంపదలు, రాజభోగాలున్నూ. ఈయన హయాంలో ఆర్జించిన వేలు లక్షలు లేకపోగా దాన ధర్మాలకు, దయా దాక్షిణ్యాలకు పేరుపొందిన నరసయ్యగారి పేరు చెడిపొడు."

అక్కడినుండి మెల్లగా కదిలి నిత్య కార్యక్రమానికి బయలుదేరారు. ఒక హోటలు దగ్గరకు చేరుకున్నారు. దాని ప్రక్కనున్న ఎంగిలాకుల కుప్పదగ్గర రెండు కుక్కలు హోరాహోరిగా పోరాడుతున్నవి. అందులో ఒకటి సర్వకాల సర్వావస్థలలో ఆ కుప్పను ఆశ్రయించుకొని యుండేది. మరొకటి ఎక్కడినుండో వచ్చినది. క్రొత్తగా వచ్చిన కుక్క రాకను ప్రాత కుక్క సహించలేక వీరవిహారం సల్పింది. దాని ధాటికి తట్టుకోలేక క్రొత్తగావచ్చిన కుక్క పలాయన మంత్రము పఠించింది.

ఆ రోజునుండి యిద్దరికి తృప్తికరమైన ఆదాయం లభించకపోవడం యిరువురిలో అసంతృప్తిని రేకెత్తించింది. పైగా ముసలాడి ఆరోగ్యం సరిగ్గాయుండకపోవడం పిల్లవాడిని చీకాకు పరచింది.

"ఈ ముసలాడు రాను రాను సోమరి యగుతున్నాడు. ఇతని వెంబడియున్నందువలన కడుపు నిండకపోగా, లేనిపోని వృథాశ్రమ మిగులుతోంది" అనుకోసాగాడు పిల్లవాడు.

"ఈ పిల్లాడు వచ్చినప్పటినుండి రోజూ దొరికే డబ్బులుకూడ దొరకడంలేదు. నా ఎప్పటి శ్రమ ఎలాగూయున్నదినాకు. లభించేకానియో, దమ్మిడియో అతనికి పంచియిచ్చి నా కడుపు కాల్చుకోడం ఎందుకు" అనుకోసాగాడు ముసలాడు.

నాలుగు రోజులు గడిచినవి. ఒకరోజురాత్రి నీరసంగా ముసలాడు పండుకొని యున్నాడు. పిల్లాడు ఎదురుగా కూర్చొని యున్నాడు.

"బాబూ! డబ్బాలో ఎన్ని డబ్బులున్నవో చూడు" అంటూ డబ్బా అందిచ్చాడు.

బాలుడు డబ్బులు లెక్కబెట్టసాగాడు. లెక్కబెడుతున్న కదలికనుబట్టి "పది, పదకొండు అణాలు దొరికియుండాలి బాబూ!" అన్నాడు.

లెక్క బెట్టడం పూర్తిచేసి "ఎక్కడిది తాతా! అంతా ఆరు అణాలున్నవి"

"అదేమిటి నాయనా! పది అణాలైనా దొరికియుంటుంది అనుకున్నానే!"

"నీవనుకుంటే లేని డబ్బులుంటవా! నన్ను నమ్మ లేకపోతే నీవే లెక్కించుకో" అంటూ జేబులో ఏవో డబ్బులు దాస్తూ డబ్బా అందిచ్చాడు.

డబ్బాలోని డబ్బులను తడువుతూ "ఎందుకు లే బాబూ! నీమీద నమ్మకంలేక కాదు నేనలా అన్నది! ఈ డబ్బులు తీసికొని వెళ్ళి మనం తింటానికే ధైనా తీసికొనిరా" అంటూ డబ్బాలోని డబ్బులను పిల్లవాడికిచ్చాడు.

పోయిన పిల్లవాడు ఎంతసేపటికీ తిరిగిరాలేదు. ముసలాడి ఆకలి దహించుకొనిపోతున్నా పళ్లు బిగబట్టి కండ్లు మూసుకొని పండుకున్నాడు. హోటలు దగ్గరి ఎంగిలాకుల కుప్పదగ్గర ఎప్పుడుండే కుక్క ఎంగిలి మెతుకులను నాకి తింటూ ఆ ఆకుల్లోనే పొర్లాడుతున్నది.

కేసరి విద్యాలయాలకు శ్రీ రామకృష్ణ దంపతుల విరాళము

3-1-57 తేదిని శ్రీ త్యాగరాయనగరములోని కేసరిస్కూళ్ల ప్రార్థన మందిరమయిన శ్రీ వేంకటేశ్వర హాలులో కేసరి మిడిల్‌స్కూలు నిర్వహణకు రు. 4000 లు విరాళము ఇచ్చిన శ్రీ పాలువాయి రామకృష్ణగారు, వారి సతీమణి శ్రీమతి భానుమతిగార్ల ఫొటో ఇండియా ప్రభుత్వము మాజీ మంత్రి బారిష్టరు శ్రీ వి. వి. గిరిగారి చేత ఆవిష్కరింపబడినది. సభకు మాజీ హైకోర్టు జడ్జి శ్రీ ప్రత్తిపాటి సత్యనారాయణరావుగారు మొదలయినవారు పెక్కుమందివిచ్చేసిరి. దివాన్ బహదూరు బండి శ్రీహరిరావు నాయుడుగారు వచ్చిన సభికులకు స్వాగతము చెప్పుతూ కీ॥ శే॥ డాక్టరు కేసరిగారి ఔదార్యమును జ్ఞప్తికి తెచ్చి, అటువంటి ఉదారులు అన్ని రంగములలోకూడా వున్నారని సంతోషించుచున్నామని చెప్పిరి. శ్రీమతి భానుమతిగారికి ఆంధ్ర గవర్నమెంటు చేసిన సన్మానమునకు అభినందించుచూ ఆసన్మానము అర్హమైనదనిరి. ఆమెయు ఆమె భర్త శ్రీ రామకృష్ణగారు అడిగినవెంటనే తెలుగు పిల్లల విద్యకు 4000 రూ. ఇచ్చుటచేత వారి ఔదార్యమును వెల్లడించు చున్నానని చెప్పిరి. శ్రీ గిరిగారు బాల బాలికల నుద్దేశించి కీ॥ శే॥ డాక్టరు కేసరిగారు చేసిన అపార సేవను, శ్రీ హరిరావుగారు చూపించుచున్న ఉత్సాహమును పొగడిరి. శ్రీమతి భానుమతిగారుఆంధ్ర గవర్నమెంటు చేసిన గౌరవమునకు ఎంతయో అర్హులనియు, స్కూలుకు ఇచ్చిన విరాళమువల్ల ఆ దంపతుల మనోవికాసము చెప్పకయే చాటుతున్నవనియు వారి ఫోటో ఆవిష్కరించుటకు తాను యెంతో సంతోషించుచున్నానని చెప్పిరి. ఆవిష్కరణ తర్వాత కేసరి మిడిల్ స్కూలు పిల్లల నాట్యమును, నాటకము ప్రదర్శింపబడెను. మిడిల్ స్కూలు ప్రధానోపాధ్యాయిని శ్రీమతి టి. వసంతలక్ష్మిగారు అర్పించిన వందనములతో సభ ముగిసెను.